
కేపీహెచ్‌బీకాలనీలోని సర్వీసు రోడ్డులో తొలగిస్తున్న ఆక్రమణలు

రోడ్లపై ఆక్రమణల తొలగింపు

కూకట్‌పల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా రోడ్లను ఆక్రయించి నిర్మించిన షెడ్లను జీహెచ్‌ఎంసీ అధికారులు బుధవారం కూల్చివేశారు. కేపీహెచ్‌బీకాలనీలోని రోడ్డునెంబర్ 2 నుంచి 3వ రోడ్డు వరకు ఉన్న సర్వీసు రోడ్డులో కొందరు రోడ్డును ఆక్రయించి సుమారు 10 షెడ్లు నిర్మించుకొని వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఫిర్యాదు అందుకొన్న మూసాపేట సర్కిల్ అధికారులు ఆ షెడ్లను కూల్చివేశారు. రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకొంటామని జోనల్ కమిషనర్ అభిలాషఅభినవ్ హెచ్చరించారు.

నాలాలలో చెత్తను తొలగించాలి


నాలాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయ్‌శేఖర్‌గౌడ్

పేట్‌బషీరాబాద్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): నాలాలలో పేరుకుపోయి మట్టి, చెత్తను తొలగించాలని రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ బి.విజయ్‌శేఖర్‌గౌడ్ అధికారులకు సూచించారు. డివిజన్‌లోని రంగారెడ్డినగర్‌లోని నాలాలలో మట్టి, చెత్త చేరడంతో వర్షం పడినప్పుడల్లా మురుగునీరు రహదారిపై పారుతోందని ఆయన ప్రజలు విన్నవించారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి కార్పొరేటర్ ఆ ప్రాంతాన్ని సందర్శించి నిధులు మంజూరు చేయించారు. నాలాలను క్లీన్ చేసే పనులను ప్రారంభించాలని అధికారులకు కోరారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సుధాకర్, బాలు, కార్తీక్, అధికారులు పాల్గొన్నారు.


కేపీహెచ్‌బీ రమ్యగ్రౌండ్ వద్ద స్వీట్లు తినిపించుకుంటున్న కూటమి అభిమానులు

ఏపీలో ప్రభుత్వం ఏర్పాటు.. కేపీహెచ్‌బీలో సంబరాలు

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో కేపీహెచ్‌బీలో బుధవారం సంబరాలు అంబరాన్నంటాయి. ఏపీ సీఎంగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం పురస్కరించుకొని కేపీహెచ్‌బీ తొమ్మిదోఫేజ్‌లో బాణాసంచా కాల్చారు. ఐదోఫేజ్ జనసేన పార్టీ కార్యాలయంలో కేక్‌కట్ చేశారు. కేపీహెచ్‌బీ మూడోఫేజ్ రమ్యగ్రౌండ్ వద్ద ఎన్డీయేలో భాగమైన తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, అభిమానులు స్వీట్లు పంచుకొంటూ నినాదాలతో హోరెత్తించారు.


ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు

టీడీపీ శ్రేణుల సంబరాలు

హైదర్‌నగర్: ఏపీ సీఎంగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేయడంతో టీడీపీ నాయకులు, అభిమానులు నిజాంపేట సాయిగణేశ్ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు.

చెరువులోకి మురుగు చేరకుండా చర్యలు తీసుకోవాలి



కమిషనర్ శ్రీహరికి వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకార కమిటీ సభ్యులు

పేట్‌బషీరాబాద్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): చెరువులోకి వస్తున్న మురుగు నీటిని కట్టడి చేయాలని కొంపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీహరికి మత్స్యకార కమిటీ సభ్యులు వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు. కొంపల్లిలోని మొగుళ్లకుంటలో కొన్నేళ్లుగా చేపలు పట్టుకొని ఉపాధి పొందే వారమని, ఇటీవల చుట్టు ప్రక్కల కాలనీల నుంచి మురుగునీరు చెరువులోకి చేరుతోందని తెలిపారు. దీనికి తోడు భవన నిర్మాణ వ్యర్థాలను సైతం చెరువులో వేస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. చెరువులోకి మురుగునీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులు భిక్షపతి, ఆంజనేయులు, గోపాల్, నవీన్, శ్యామ్, రాజు, కృష్ణ, అశోక్, రమేష్, బాలకృష్ణ కమిషనర్‌ను కోరారు.

వాటర్‌ట్యాంక్‌ను ఏర్పాటు చేయాలి


సుదర్శన్‌రెడ్డిని కలిసిన మహాదేవపురంవాసులు

గాజులరామారం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): గాజులరామారంలో 10 మిలియన్ లీటర్ల స్టోరేజీ వాటర్ ట్యాంక్, పంపు సెట్‌ను ఏర్పాటు చేయాలని మహాదేవపురం కాలనీ వాసులు వాటర్‌వర్క్స్ మేనేజింగ్ డైరెక్టర్ సి.సుదర్శన్‌రెడ్డిని ఖైరతాబాద్‌లో ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మహాదేవపురం కాలనీలో సరిగా వాటర్ సప్లై కావడం లేదని, కొన్నేళ్లుగా నీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్నామని ఆయనకు వివరించారు. కార్యక్రమంలో ప్రసాద్, జగదీశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నరేందర్, దిలీప్, తాతయ్యచౌదరి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్ సత్యనారాయణకు వినతిపత్రం ఇస్తున్న అంబేడ్కర్ సంఘం సభ్యులు

స్థలం కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

దుండిగల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): గ్రామంలో పురాతనమైన మంచినీటి బావిని పూడ్చి ఆ స్థలాన్ని కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గాగిల్లాపూర్ అంబేడ్కర్ సేవా సంఘం సభ్యులు గండిమైసమ్మ దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణకు బుధవారం ఫిర్యాదు చేశారు. గాగిల్లాపూర్ వార్డు నెం.1 ఎస్సీ బస్తీలో పురాతన మంచి నీటి బావి ఉంది. దాని ప్రక్కనే ఉన్న ఇద్దరు వ్యక్తులు ఆ బావిని పూడ్చి స్థలానికి ప్రహరీ నిర్మిస్తున్నారని కమిషనర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కబ్జా అవుతున్న భూమిని కాపాడి ప్రజావసరాలకు ఉపయోగపడేలా చూడాలని అంబేడ్కర్ సేవా సంఘం సభ్యులు కమిషనర్‌ను కోరారు.

ఉమామహేశ్వర్ కాలనీలో ఇళ్లలోకి వర్షం నీరు

పేట్‌బషీరాబాద్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి కొంపల్లి మున్సిపల్‌లోని ఉమామహేశ్వర్ కాలనీలోని నాలుగు ఇళ్లలోకి వర్షపు నీరు వచ్చి చేరింది. దీంతో ఇంట్లో సామగ్రి తడిచిపోయింది. లోక్‌సభ ఎన్నికల ముందు కాలనీలో రోడ్లను వేసేందుకు మట్టిని పోసి వదిలేశారు. మట్టి ఎత్తుగా ఉండడంతో నీరంతా ఇళ్లలోకి వచ్చి చేరిందని, మట్టి కారణంగానే వరదనీరు ఇళ్లలోకి వచ్చిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఇళ్లలోకి వర్షంనీరు రాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.


బాచుపల్లి ప్రభుత్వ పాఠశాలలో ప్రార్థనల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు


రావినారాయణరెడ్డినగర్‌లో అందజేసిన పుస్తకాలతో విద్యార్థులు


గాజులరామారం పాఠశాలలో పాకురు పట్టిన వాష్‌బేసిన్

బడిగంటలు మోగిన వేళ..

- మొదటి రోజు పుస్తకాలు, యూనిఫాంల పంపిణీ
- అరకొర సదుపాయాలతోనే ఆరంభం

కుత్బుల్లాపూర్ జోన్‌బృందం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో ఇళ్ల వద్ద తల్లిదండ్రులతో సరదాగ గడిపిన విద్యార్థులు సెలవులు అనంతరం బుధవారం పాఠశాలలు ప్రారంభమయ్యాయి. కుత్బుల్లాపూర్, బాచుపల్లి, గండిమైసమ్మ మండలాల్లో ప్రభుత్వ పాఠశాలలు 107 ఉన్నాయి. అందులో 86 ప్రాథమిక పాఠశాలలు ఉండగా, 21 ఉన్నత పాఠశాలలున్నాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలపై 'ఆంధ్రజ్యోతి' బృందం విజిట్ చేసింది. కుత్బుల్లాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో మరుగుదొడ్లు సరిగా లేవు, స్వీపర్స్ లేక ఉపాధ్యాయులు, విద్యార్థులు స్కూల్‌ను ఊడ్చుతున్నారు. విద్యార్థులకు ఇప్పటి వరకు యూనిఫామ్స్ రాలేదు. నందానగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు విద్యార్థులు సమయానికి వచ్చినా, 9 గంటలకు పాఠశాలకు తాళం వేసి ఉండడంతో ప్రక్కనే ఉన్న బస్తీ దవాఖానా వరండాపై కూర్చొన్నారు. గాజులరామారం గ్రామం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సరిపడా టాయిలెట్స్ లేక పోవడంతో గతేడాది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ ఏడు కూడా పరిస్థితి అలాగే ఉంది. వర్షం వస్తే కురిసే తరగతి గదుల్లోనే విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

● ఉపాధ్యాయులు ఏరీ ?

కేపీహెచ్‌బీకాలనీ: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన అలా ఉంచితే తరగతికి ఒక్క ఉపాధ్యాయుడు కూడా లేని పరిస్థితి కేపీహెచ్‌బీలో నెలకొంది. ఈ మేరకు 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా బుధవారం ప్రభుత్వ పాఠశాలలను సందర్శించినప్పుడు అక్కడ వాస్తవ పరిస్థితి అర్థమైంది. కేపీహెచ్‌బీ నాలుగో ఫేజ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతులకు గాను మూడు గదులు ఉన్నాయి. ఇక్కడ ఇద్దరే ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. కేపీహెచ్‌బీ మూడో ఫేజ్ భువనవిజయం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు శాశ్వత భవనం లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ కూడా ఐదుగురు ఉపాధ్యాయులు అవసరం ఉండగా ముగ్గురే ఉన్నారు. దాతలు ఎవరైనా ముందుకొచ్చి విద్యా వలంటీర్లకు జీతం ఇస్తే తప్పా ఇక్కడ విద్యాబోధన సాగటం కష్టమే.


కేపీహెచ్‌బీ నాలుగోఫేజ్ పాఠశాలలో..

● విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

కూకట్‌పల్లి: మూసాపేటలోని బబ్బుగూడలోని ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేటర్ మహేందర్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు బుధవారం పంపిణీ చేశారు. పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా విద్యార్థులకు ఆయన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విశాల, ఉపాధ్యాయులు దీపిక, సత్యనారాయణ, అనిల్, సరోజిని, నాయకులు మల్లేష్‌గౌడ్, డాకయ్య, ఎర్రస్వామి, భాస్కర్, బసవరాజు, యాదగిరి పాల్గొన్నారు.

● పుస్తకాలు, యూనిఫాంల పంపిణీ

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని లింగంపల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్, మండల ప్రాథమిక పాఠశాలలో బుధవారం బడిబాట కార్యక్రమంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, మండల విద్యాధికారి వెంకటయ్య పాల్గొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈనెల 6న ప్రారంభమైన బడిబాట కార్యక్రమం 19వ తేదీ వరకూ కొనసాగుతుందని తెలిపారు. తొలిరోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, యూనిఫాంలు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రధానోపాధ్యాయులు శైలజ, బీమయ్య, మహేందర్, నాయకులు రామబోయిన రాజుయాదవ్, శ్రీనివాస్‌యాదవ్ రవీందర్ గౌడ్, ప్రసాద్, పద్మారావు, రాంబాబు, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.


విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, ఎంఈఓ వెంకటయ్య

నిబంధనలు పాటించని బస్సుల సీజ్

పేట్‌బషీరాబాద్: స్కూల్స్ ప్రారంభం కావడంతో నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న బడి బస్సులపై ఆర్టీఏ అధికారులు బుధవారం కొరడా ఝుళిపించారు. మేడ్చల్ జిల్లా రవాణశాఖ అధికారి రఘునందన్ ఆధ్వర్యంలో మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్స్ పలు స్కూల్స్, ఇంజనీరింగ్ కళాశాల బస్సులను తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో సరియైన ధ్రువ పత్రాలు లేని 14 బస్సులను అధికారులు సీజ్ చేశారు. మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్స్ ఎస్వీఎన్ ప్రతాప్ రాజు, ఆర్ బాబు, శిల్ప, ఎల్.త్రివేణిబాయ్ సిబ్బంది ఉన్నారు.


వాహనాలను తనిఖీ చేస్తున్న మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్

తొలిరోజు హాజరు అంతంతే..

బాలానగర్: వేసవిసెలవుల అనంతరం బుధవారం బడిగంట మోగింది. వేసవి సెలవులను ఎంజాయ్ చేసిన విద్యార్థులు మొదటి రోజు బడిబాట పట్టారు. తొలిరోజు కావడంతో హాజరైన వారి సంఖ్య చాలా తగ్గింది. బాలానగర్ చెరబండరాజు కాలనీలో, ఫతేనగర్ పిట్టలబస్తీలో స్కూల్ భవనాలు లేకపోవడంతో విద్యార్థులు సమీపంలో ఉన్న కమ్యూనిటీ హాలులోనే చదువుతున్నారు. విద్యార్థులకు హెచ్ఎంలు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు అందజేశారు.


బాలానగర్ చెరబండరాజు కాలనీ స్కూల్లో హాజరైన విద్యార్థులు

బాలానగర్ బస్తీలో కార్పొరేటర్ పర్యటన


అధికారులతో పర్యటిస్తున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

బాలానగర్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిశీలించేందుకు కార్పొరేటర్ ఆవుల రవీందర్ అధికారులతో కలిసి డివిజన్‌లో బుధవారం పర్యటించారు. వర్షాకాలంలో నాలా సమస్యలు తలెత్తకుండా పూడికతీత పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. రోడ్లపై చెత్తాచెదారం పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించే విధంగా సిబ్బందికి సూచించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్కిల్ డీఈ బాలకృష్ణ, ఏఈ మహ్మద్ రషీద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాము, డివిజన్ నాయకులు ఖాజ, నరేశ్, రవి, నాగేశ్వర్‌రావు, యాదగిరిరెడ్డి, సోఫీ పాల్గొన్నారు.

శివశంకర్‌నగర్‌లో కార్పొరేటర్ పర్యటన


నీటి సమస్యపై ఆరా తీస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

ఫతేనగర్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్‌లో ఎలాంటి సమస్య ఉన్నా వెంటనే తన దృష్టికి తేవాలని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ ప్రజలకు సూచించారు. డివిజన్ పరిధి శివశంకర్‌నగర్‌లో కలుషిత నీరు సరఫరా అవుతోందని స్థానికుల నుంచి వచ్చిన సమాచారంతో జలమండలి అధికారులతో కలిసి బస్తీలో పర్యటించి కలుషిత నీటి సమస్యను పర్యటించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బస్వరాజ్, సాయినాథ్‌గౌడ్ పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది


జడ్‌సీకి వినతిపత్రం ఇస్తున్న జగదీశ్వర్‌గౌడ్, హమీద్‌పటేల్

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికతో ముందుకెళ్తుందని నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, కొండాపూర్ కార్పొరేటర్ హమీద్‌పటేల్ పేర్కొన్నారు. ఈ మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు ప్రణాళికలు సిద్ధం చేయాలని జోనల్‌కమిషనర్ స్నేహశబరీష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో తాగునీటి సరఫరా లేని ప్రాంతానికి పైపులైన్లు ఏర్పాటు చేయాలని, చందానగర్ నుంచి హఫీజ్‌పేట వరకు మంజీర రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలన్నారు.

17న సాయిదత్త గణపతి వార్షికోత్సవం

రాయదుర్గం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): టెలికాంనగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయం దశమ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 17 నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 5.30 గంటకు స్వామివారికి కాగడహారతి, గణపతిపూజ, పుణ్యాహవచనం, మంటపారాధన, గణపతి, దత్తాత్రేయస్వామికి పంచామృతాభిషేకం, మంగస్నానాలు, రుద్రహోమం, పల్లకిసేవ వంటి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

మూసాపేట హనుమాన్ ఆలయంలో శ్రీరామ్ కథా సత్సంగ్

హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మూసాపేట హనుమాన్ ఆలయంలో రామకథ సత్సంగ్ కార్యక్రమాన్ని 16వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పండింత్ మదన్‌దాస్‌జీ మహంత్ తెలిపారు. హైదరాబాద్ మార్బల్ కాంట్రాక్టర్స్ ఆధ్వర్యంలో నిర్వహించే రామకథ సత్సంగ్‌లో అయోధ్య నుంచి వచ్చిన రామ్‌లల్లా సర్కార్, కథావాచక్ పండిట్ రవిశాస్త్రిల ఆధ్వర్యంలో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సమస్యలు, అభివృద్ధి పనులపై సమీక్ష


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, మాదాపూర్, మియాపూర్, హఫీజ్‌పేట, చందానగర్, భారతినగర్ డివిజన్ల పరిధిలోని కాలనీల్లోని సమస్యలు, అభివృద్ధి పనులపై మియాపూర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గాంధీ బుధవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. ప్రజా అవసరాల దృష్ట్యా కాలనీల్లో నెలకొన్న రోడ్డు సమస్యలను ప్రాధానత్యగా పరిగణలోకి తీసుకుని త్వరితగతిన పరిష్కారమయ్యేలా కృషి చేయాలని, పనులు వేగం పెంచాలన్నారు. పెండింగ్ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అవసరం ఉన్న చోట కొత్త ప్రతిపాదనలు తీసుకురావాలన్నారు. వర్షాకాలంను దృష్టిలో పెట్టుకుని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. మాన్‌సున్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఈఈ శ్రీనివాస్, ఈఈకెవిఎస్ రాజు, డీఈలు రమేష్, దుర్గాప్రసాద్, స్రవంతి, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

పాత సమస్యలతోనే తెరుచుకున్న బడులు


ఫతేనగర్ పిట్టలబస్తీలో మధ్యలోనే నిలిచిపోయిన పాఠశాల భవనం పనులు

బాలానగర్/ ఓల్డుబోయినపల్లి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగియడంతో విద్యార్థులు బుధవారం బడిబాట పట్టారు. అయితే తొలి రోజు అనుకున్న విధంగా విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరు కాకపోవడంతో ఏ ప్రభుత్వ పాఠశాలలో చూసినా తరగతి గదులన్నీ బోసిపోయి కనిపించాయి.

- బాలానగర్ డివిజన్ పరిధి చరబండరాజు కాలనీ ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణం పూర్తి కాకపోవడంతో కమ్యూనిటీహాలులోనే చదువు కొనసాగుతోంది. ఫతేనగర్ డివిజన్ పరిధి పార్థివ్‌వాడ (పిట్టలబస్తీ)లో స్కూలు భవన నిర్మాణం అర్థాంతరంగా ఆగిపోయింది. పాఠశాలలో బాత్రూంలు లేవు.
- ఓల్డుబోయినపల్లి డివిజన్ అంజయ్యనగర్ పాఠశాలలో కరెంటు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కరెంట్ బిల్లు చెల్లించలేదని అధికారులు కరెంట్ కట్ చేసి నాలుగేళ్లయింది. సమస్యను ఎవరూ పరిష్కరించలేదు.

తొలగని సమస్యలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ప్రాంతంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో మంచినీరు, మరుగుదొడ్లు, పరిశుభ్రతకు సంబంధించిన సమస్యలు నెలకొన్నాయి. మొదటి రోజు తరగతులు పూర్తిస్థాయిలో ప్రారంభంకాలేదు. మంచినీటి ట్యాప్స్ ఏర్పాటు పనులను రెండు రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకొంటున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

మహిళను బెదిరించి రూ.6.45 లక్షలు లూటీ

హైదరాబాద్ సిటీ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): సీబీఐ దర్యాప్తు చేస్తున్న మనీలాండరింగ్ కేసులో మీ బ్యాంకు ఖాతా నుంచి లావాదేవీలు జరిగాయని బెదిరించిన సైబర్ నేరగాళ్లు ఆమె ఖాతా నుంచి రూ.6.45 లక్షలు లూటీ చేశారు. షాక్ నుంచి తేరుకున్న మహిళ మోసపోయినట్లు గుర్తించి సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ఓ గృహిణికి ఇటీవల గుర్తుతెలియని నంబర్ నుంచి ఫోన్ వచ్చింది. అవతలి వ్యక్తి తాను టెలికామ్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా(ట్రాయ్) నుంచి మాట్లాడుతున్నానని పరిచయం చేసుకున్నాడు. ముంబైలోని కనకియా పోలీస్‌స్టేషన్‌లో మీపై కేసు నమోదైంది. మీ ఫోన్ నంబర్ నుంచి అసభ్య మెసేజ్‌లు, నేరపూరితమైన నకిలీ ప్రకటనలు సర్క్యులేట్ అయినట్లు, మీ బ్యాంకు ఖాతా నుంచి అక్రమ ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు తేలిందని చెప్పాడు. మీపై నమోదైన క్రిమినల్ కేసుకు సంబంధించి పూర్తి ఆధారాలు చూపిస్తామని నమ్మించిన నేరగాళ్లు.. బాధితురాలితో స్కైప్ కాల్‌లో మాట్లాడారు. ఆమె ఆధార్ కార్డు, కెనరా బ్యాంకు ఖాతాలో లింకు చేసిన ఆధార్ కార్డు అక్కటే అని చూపించారు. ఈ కేసును సీబీఐ అధికారులు విచారిస్తున్నారని, సుప్రీంకోర్టు నుంచి మీపై అరెస్టు వారెంట్ జారీ అయిందని చూపించారు. జెట్ ఏయిర్‌వేస్ వ్యవస్థాపకుడు నరేష్ గోయల్ చేసిన రూ.200 కోట్ల కుంభకోణంలో మీ పాత్ర ఉన్నట్లు, ఆ మనీ లాండరింగ్‌లో మీ కెనరా బ్యాంకు ఖాతా నుంచి అక్రమ లావాదేవీలు జరిగినట్లు ఆధారాలు లభించాయని నకిలీ పత్రాలు చూపించి భయపెట్టారు. ఏ క్షణమైనా మిమ్మల్ని అరెస్టు చేస్తారని బెదిరించారు. ఈ కేసులోంచి బయటపడాలంటే మీ ఖాతాలో ఉన్న నగదు మొత్తాన్ని ఆర్‌బీఐ ఆధీనంలో ఉన్న ఖాతాకు బదిలీ చేయండి, మీ అకౌంట్ లావాదేవీలు అన్ని సక్రమంగానే ఉన్నాయని తేల్చిన తర్వాత మీ డబ్బులు యథావిధిగా మీ ఖాతాలో జమ చేస్తారని నమ్మించారు. దాంతో బాధిత మహిళ తన ఖాతాలోని డబ్బులు వారు చెప్పిన అకౌంట్‌కు బదిలీ చేసింది. ఆ వెంటనే నిందితులు కాల్ కట్ చేశారు. తర్వాత షాక్ నుంచి కోలుకున్న మహిళ జరిగిన విషయం కుటుంబసభ్యులకు చెప్పింది. ఇదంతో ఏదో మోసంలా ఉందని గుర్తించి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టిన డబ్బు రికవరీ

- వృద్ధుడికి రూ.50.22 లక్షల చెక్కు అందజేత

హైదరాబాద్ సిటీ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): క్రైమ్ బ్రాంచి పోలీసులం అంటూ ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు.. నగరానికి చెందిన 74 ఏళ్ల వృద్ధుడిని భయభ్రాంతులకు గురిచేసి, మాదకద్రవ్యాల కేసులో అరెస్టు చేస్తున్నామంటూ బెదిరించి రూ. 50లక్షలకు పైగా కొల్లగొట్టారు. ఆ తర్వాత కంగుతిన్న బాధితుడు 1930కు ఫోన్ చేసి, సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన పోలీసులు సాంకేతిక ఆధారాలను సేకరించి సైబర్ నేరగాళ్లు కొట్టేసిన డబ్బును ఆయా బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ చేశారు. ఎక్కడెక్కడ ఎంత డబ్బు ఫ్రీజ్ చేశారో డేటాను సైబర్ క్రైమ్ పోలీసులకు అందించారు. బ్యాంకుల సహకారంతో డబ్బులను రికవరీ చేసిన పోలీసులు.. బాధితుడు పోగొట్టుకున్న రూ. 50.22లక్షలను చెక్కు రూపంలో డీసీపీ కవిత ధార అందజేశారు.


బాధితుడికి చెక్కు అందజేస్తున్న డీసీపీ కవితధార

22న హెచ్‌సీఏ టాలెంట్ హంట్


దేవ్‌రాజ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఫాస్ట్ బౌలర్ల కోసం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ప్రత్యేకంగా టాలెంట్ హంట్ నిర్వహిస్తోందని కార్యదర్శి దేవ్‌రాజ్ తెలిపారు. ఈనెల 22వ తేదీన ఉప్పల్ స్టేడియంలో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ టాలెంట్ హంట్‌ను నిర్వహించనున్నామని చెప్పారు. ఆసక్తి గల క్రికెటర్లు వచ్చే శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి తమ పేర్లను హెచ్‌సీఏ అధికారిక వెబ్‌సైట్‌లో (www.hycricket.in) నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అయితే, ఈ ప్లేయర్లు గతంలో హైదరాబాద్ జట్టుకు కానీ, బీసీసీఐకి ఆడిన వారై ఉండకూడదని, ఈ టాలెంట్ హంట్ కొత్త వాళ్లకు కోసం చేపడతున్నామని దేవ్‌రాజ్ చెప్పారు.

రైల్వే డిగ్రీ కళాశాలలో నూతన కోర్సులు

చిలకలగూడ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యా సంవత్సరానికి తార్నాక రైల్వే డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దోస్త్ ఆన్‌లైన్ కోటాలో దరఖాస్తు చేసుకోవచ్చని దక్షిణ మధ్య రైల్వే బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ విద్యాసంవత్సరం నుంచి బీబీఏ, బీకాం(ఫైనాన్స్) నూతన కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు, ప్రవేశానికి అన్ని కోర్సులకూ ఆన్‌లైన్ దోస్త్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.